సమస్యల కూత

- వేదాయపాళెం రైల్వేస్టేషన్‌పై దయేదీ..?
- కరెంట్ ఎప్పుడు ఉంటుందో తెలియని దుస్థితి
- లిఫ్టు సౌకర్యానికి నోచుకోని వైనం



వేదాయపాళెం రైల్వేస్టేషన్ (ఇన్‌సెట్లో) లిఫ్టు సౌకర్యానికి నోచుకోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్ తర్వాత వేదాయపాళెం స్టేషన్ కీలకమైంది. ఈ స్టేషన్లో రోజూ 11 రైళ్లు ఆగుతుండగా.. 1500 నుంచి 1700 మంది రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇక్కడ వసతులు మృగ్యమయ్యాయి. సూచిక బోర్డు లేక.. షెల్టర్లు కానరాక.. లిఫ్టు సౌకర్యం లేక ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతమవుతున్నాయి. పలు రైల్వేస్టేషన్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్న అధికారులు దీనిపై దృష్టి సారించకపోవడం గమనార్హం. ఈ విషయమై స్థానిక రైల్వే అధికారులను సంప్రదించగా, ఉన్నతాధికారులే వివరాలు చెప్తారని, తామేమీ చెప్పకూడదని బదులిచ్చారు.

ఇవీ సమస్యలు..

- వేదాయపాళెం రైల్వేస్టేషన్లో విద్యుత్ వ్యవస్థ దుర్భరంగా మారింది. చీకటి పడితే కరెంట్ ఉండటం గగనమవుతోంది. నిత్యం ఇదే సమస్య నెలకొనడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- ఏ బోగీ ఎక్కడ ఆగుతుందో చెప్పే సౌకర్యం ఇక్కడ లేదు. వాస్తవానికి పలు రైల్వేస్టేషన్లలో ఏ బోగీ ఎక్కడ ఆగుతుందనే వివరాలను తెలియజేసేలా డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే అవి ఇక్కడ కానరావడంలేదు. ఫలితంగా రైలొచ్చిన సందర్భాల్లో ప్రయాణికులు పరుగులు తీయాల్సి వస్తోంది.
- ఓ ప్లాట్‌ఫారం నుంచి మరో ప్లాట్‌ఫారానికి వెళ్లాలంటే వృద్ధులు నానా అవస్థ పడుతున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జికి అనుసంధానంగా లిఫ్టు సౌకర్యం ఇక్కడ లేదు.
- టికెట్ కౌంటర్, మరో ప్రాంతంలో మాత్రమే రేకుల షెడ్డు ఉంది. ఫలితంగా వర్షమొచ్చిన సందర్భాల్లో చెట్ల కింద ప్రయాణికులు నిలవాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్లాట్‌ఫారంపై కానరాని రేకుల షెడ్డు

రేకుల షెడ్లు ఏర్పాటు చేయాలి

వేదాయపాళెం రైల్వేస్టేషన్లో ప్రయాణికుల సౌకర్యార్థం షెడ్లను ఏర్పాటు చేయాలి. రాత్రి వేళ కరెంట్ సమస్య తీవ్రంగా ఉంటోంది. పలు మార్లు స్టేషన్‌కు రాత్రి వేళ వచ్చినప్పుడు ఇదే సమస్య నెలకొంది.

– నిరంజన్, ప్రయాణికుడు

డిస్‌ప్లే బోర్డులను ఉంచాలి

ఏ బోగీ ఎక్కడ ఆగుతుందనే వివరాలను తెలియజేసేలా డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలి. మైకులో ఎప్పుడు చెప్తారో తెలియని పరిస్థితి. దీంతో రైలొచ్చిన సమయాల్లో పరుగులు తీయాల్సి వస్తోంది. ఫుట్ ఓవర్ బ్రిడ్జికి అనుసంధానంగా లిఫ్టు లేదా ఎస్కలేటర్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– హర్ష, ప్రయాణికుడు

జగనన్న సురక్షతో లబ్ధి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న అరుణమ్మ, రంగారెడ్డి

నెల్లూరు రూరల్: జగనన్న సురక్షతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. కాకుపల్లిలోని సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా నెల పాటు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తుండటంపై ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. అనంతరం పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తొలుత వీరిని సత్కరించారు. ఆర్డీఓ మలోల, రూరల్ ఎంపీపీ విజయకుమార్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ గోపీ, వైస్ ఎంపీపీ రవీంద్రరెడ్డి, కాకుపల్లి, కలివెలపాళెం సర్పంచ్‌లు కోసూరు సుభాషిణి, మధుసూదన్‌రెడ్డి, నేతలు కోసూరు కేశవులుగౌడ్, చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, రమణయ్య, వేణు, రాధయ్య, సాల్మాన్, వెంకటేశ్వర్లురెడ్డి, వీరరాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులపై వేధింపులు ఆపాలి



నెల్లూరు(బారకాసు): నగరంలో ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలాలను చూపడంతో పాటు వారిపై వేధింపులను ఆపాలని నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘ నేతలు కోరారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నాను సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు మంగళవారం చేపట్టారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, సీఐటీయూ నేతలు కిన్నెరకుమార్, రాంబాబు, ఆటో కార్మిక సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రాజా, సురేష్, నాగూర్‌బాబు, మురళి, జగదీష్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెల్లువెత్తిన అభిమానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరానికి చెందిన బీబీఏ విద్యార్థి ఆనంద్‌కుమార్ నెల్లూరు నుంచి లద్దాఖ్‌కు బైక్ యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా లేహ్ నగరానికి సమీపంలో 17982 అడుగుల ఎత్తులో ఉన్న ఖార్దుంగ్లా పాస్ వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఫ్లెక్సీని ప్రదర్శించి తన అభిమానాన్ని చాటుకున్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో..



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో కొలువైన అమ్మవారిని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగన్నాథరావు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వీరికి అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. తొలుత వారిని ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. ఆలయ ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్థివదేహాల తరలింపునకు వాహనం ఏర్పాటు



నెల్లూరు(బృందావనం): కులమతాలకతీతంగా పార్థివదేహాల అంతిమయాత్ర కోసం పరదైసు యాత్ర వాహన సేవలను ప్రారంభించామని శంషాబాద్ ఎయిర్‌పోర్టు జీఎం, నెల్లూరీయుడు మొలకలపల్లి రాజకిషోర్ పేర్కొన్నారు. తన తల్లిదండ్రులు జాషువా రాజారత్నం, రమా జ్ఞాపకార్థం మొలకలపల్లి ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వాహనాన్ని దర్గామిట్టలోని సాల్వేషన్ ఆర్మీ కార్యాలయంలో ఏర్పాటు చేశామని వివరించారు. వాహనం అవసరమైన వారు 92810 89601, 92810 89602 నంబర్లను సంప్రదించి సేవలను ఉచితంగా పొందాలని కోరారు. లూథర్స్, శామ్యూల్, బాలసుధాకర్, సురేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

‘విశ్వభారతి’లో అన్నదానం



విశ్వభారతి అంధుల పాఠశాలలో..



గీతామయి వృద్ధాశ్రమంలో..

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): బీవీనగర్‌లోని విశ్వభారతి అంధుల పాఠశాలలో అన్నదానాన్ని నెల్లూరు జిల్లా రిటైర్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, రాఘవన్, కార్యవర్గ సభ్యులు గన్నయ్య, సుందరరావు, జిలానీబాషా, నారాయణరాజు, కృష్ణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, పావురాల వేణు, తదితరులు పాల్గొన్నారు.

గీతామయిలో..

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానాన్ని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తన తల్లి సీతారామమ్మ తొమ్మిదో వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన చెప్పారు.

డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా



నెల్లూరు(బారకాసు): జిల్లాలోని ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలంటూ సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ధర్నాను సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణమ్మ మాట్లాడారు. అనంతరం వినతిపత్రాన్ని కార్యాలయ ఏఓ రామ్‌గోపాల్‌కు అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, కోశాధికారి మధుసూదన, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని నారాయణరెడ్డిపేట సబ్‌స్టేషన్లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని ఏఈ శ్రీలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తకాలువ, నారాయణరెడ్డిపేట, కోడూరుపాడు, నాలుగో మైలు, నవలాకులతోట, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు సిటీ: వెంకటాచలం – వేదాయపాళెం రైల్వేస్టేషన్ల మధ్యలోని హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతంలో పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మృతుడు గ్రే రంగుపై తెలుపు రంగు అడ్డుగీతల హాఫ్ హ్యాండ్స్ టీ షర్ట్, తెలుపు రంగు నిలువు గీతల లుంగీని ధరించి ఉన్నారు. మృతుడికి 65 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న అనిల్‌కుమార్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు గానూ కార్యాలయాల చుట్టూ ప్రజలు గతంలో ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన అందుబాటులోకి వచ్చిందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ఆరెస్సార్ హైస్కూల్లో 8వ డివిజన్‌కు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మంగళవారం నిర్వహించారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే త్వరితగతిన జారీ చేస్తున్నారని వివరించారు. డివిజన్‌కు సంబంధించి 1300 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశామని వివరించారు. కరోనా సమయంలో కుటుంబసభ్యులే భయపడిన సందర్భంలో వలంటీర్లు అనేక సేవలను అందించారని.. అలాంటి వారిపై కొందరు అనుచితంగా మాట్లాడటం తగదని హితవు పలికారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన సచివాలయ వ్యవస్థను తమిళనాడులోనూ అందుబాటులోకి తీసుకొస్తున్నారని చెప్పారు.

నాలుగేళ్లుగా పత్తాలేరు..

విద్యార్థులను దగా చేసి వేల కోట్లు సంపాదించిన వ్యక్తి గత ఎన్నికల్లో తనపై పోటీ చేశారని, 70 వేలకుపైగా ప్రజలు ఓట్లు వేసినా సదరు వ్యక్తి ఈ నాలుగేళ్లలో ఎవరికీ కనిపించలేదని చెప్పారు. కరోనా సమయంలో ఒక్క కుటుంబానికైనా తన ఆస్పత్రిలో ఒక్క రూపాయైనా తగ్గించారానని ప్రశ్నించారు. నారాయణ స్కూళ్లలో పేదవారిని ఉచితంగా చేర్చుకున్నారానని ప్రశ్నించారు. విద్యా సంస్థలు, వ్యాపారాలను ఎలా కాపాడుకోవాలనే ఆలోచనే తప్ప ప్రజల గురించి పట్టించుకునే పరిస్థితి లేదని చెప్పారు. 28 ఏళ్లకే రాజకీయాల్లోకి వచ్చిన తాను నిరంతరం ప్రజల మధ్యే తిరుగుతుంటానని.. వారి ఆశీస్సులతో మరో 15 ఏళ్ల పాటు రాజకీయాల్లో ఉంటానని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మొద్దని కోరారు. కమిషనర్ వికాస్ మర్మత్, కార్పొరేటర్ మొగళ్లపల్లి కామాక్షిదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా హృద్రోగ పరీక్షలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అవసరమైన వారు రాజన్న గుండె భరోసా కార్యక్రమం ద్వారా ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 39, 40వ డివిజన్లకు సంబంధించిన రాజన్న గుండె భరోసా కార్యక్రమాన్ని మూలాపేటలోని ఈఎస్సార్ఎం స్కూల్లో గల అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఎనెల్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రక్త పరీక్ష, ఈసీజీ, ఎకో, తదితరాలను నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేయనున్నామని వెల్లడించారు. గుండెలో ఏదైనా సమస్యలుంటే యాంజియోగ్రామ్ తీసి ఆపరేషన్లను చేయిస్తామని తెలిపారు. కార్యక్రమం ద్వారా గతంలో ఐదు వేల మంది పరీక్షలు చేయించుకుంటే, ఎంతో మందికి మందులను ఉచితంగా అందజేయడంతో పాటు 200 మందికి ఆపరేషన్లను చేయించామని పేర్కొన్నారు. దాదాపు 265 మందికి వైద్య పరీక్షలను డాక్టర్ నాగేంద్రప్రసాద్ నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు.